



ముస్లిముల ర్యాలీకి మద్దతుగా మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

దారులు మారలేదు..

"సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా మారుస్తాం.." ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పలు సార్లు ఉద్ఘాటించిన మాటలు. అయితే సంక్రాంతి కాదు ఉగాది దాటిపోయినా చాలా ప్రాంతల్లో గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ రోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకూ అది ఏ రోడ్లయినా గుంతలు, గతుకులు కనిపించడం సాధారణం అయిపోయింది. వర్షాకాలం చిన్నపాటి వర్షానికి గుంతలు, బురదమయంగా మారుతున్న రహదారులు ఎండాకాలంలో కంకర తేలి గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. అధ్వాన్నంగా మారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ప్యాచ్ వర్క్‌లకే పరిమితమైంది. కొత్త రోడ్ల మీద దృష్టి సారించడం లేదు...

- అధ్వాన్నంగా గ్రామీణ రోడ్లు
- ప్యాచ్ వర్కులకే పరిమితమైన ప్రభుత్వం
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



చిప్పగిరి మండల కేంద్ర నుంచి డేగులపాడు, ఏరూరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై నిత్యం విద్యార్థులు, ప్రజలు ఆస్పత్రికి వెళ్లేవారు చిప్పగిరికి, గుంతకల్లుకు ప్రయాణం చేయవలసి ఉంది. ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే అందరూ భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి-చిప్పగిరి

మండల కేంద్రమైన హాలహర్వి నుండి మజార గ్రామమైన మాచనూరుకు వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. కల్వర్టు బ్రిడ్జి పడిపోయి దాదాపుగా 9 సంవత్సరాలు అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అలాగే నిట్రవట్టి నుండి విరుపాపురం వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారింది.

ప్రజాశక్తి-హాలహర్వి





నందవరం నుండి నాగలదిన్నె వెళ్లే ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. నెలలో కనీసం రెండు ప్రమాదాలైనా చోటు చేసుకుంటున్నాయి. గత సంవత్సర కాలంలో ఈ రహదారులపైన భారీ ప్రమాదాలు జరిగి చాలామంది క్షతగాత్రులయ్యారు. కొంతమంది మృత్యువాత పడ్డారు.

ప్రజాశక్తి-నందవరం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. గతేడాది అధిక వర్షాల వల్ల సగానికి పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల బారిన పడుతున్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లే లక్ష్యమని పాలకులు ఊదరగొట్టినా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని పలు గ్రామాల రోడ్లు ఇప్పటికీ గుంతలతోనే దర్శనమిస్తున్నాయి. హాలహర్వి మండలంలో గూళ్యం నుండి బళ్ళురు, గూళ్యం నుండి జే హొసల్లి, చింతకుంట నుండి బేవిన హాల్, చింతకుంట నుండి సిరుగాపురం, చింతకుంట నుండి ఎంకేపల్లి, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఆ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. నందవరం మండలంలో కనకవీడు నుండి నాగలదిన్నె, పోనకలదిన్నె వెళ్లే రహదారులు, పూలచింత నుండి నాగలదిన్నె రోడ్డుకు వెళ్లే రహదారి,నందవరం నుండి హాలహర్వి వెళ్లే రహదారులు గుంతల పడి కనీసం మరమ్మతలకు నోచక దుర్భరంగా ఉన్నాయి. మండలంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ఎంత మంది మరణించినా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాని ప్రజలు వాపోతున్నారు. సి.బెలగల్ మండలం ముడుమాల, పలుకుదొడ్డి మధ్య తారు రోడ్డు ఆనవాళ్లు కానరాక మట్టి రోడ్డుగా మారిపోయింది. చింతమాను పల్లె-బెలగల్ మధ్య కల్వర్టుకు రంధ్రం ఏర్పడి ఏడాది అవుతున్నా పట్టించుకోవడం లేదు. ముడుమాల నుంచి గుండ్రేవుల, కొండాపురం మీదుగా నాగలదిన్నె వెళ్లే రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు, ఆదోని వెళ్లే రహదారులు కూడా చాలా ప్రాంతాల్లో గతుకులుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్ల మరమ్మతులు పూర్తి చేశాం

సంక్రాంతి లోపల గుంతలు పడ్డ 412 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు పూర్తి చేశాం. మెయింటెనెన్స్ చేయనివి 48 కిలోమీటర్లు, ఎన్‌డిబి 62 కిలోమీటర్లు మొత్తం 110 కిలోమీటర్లకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే వాటిని ప్రారంభిస్తాం. అన్నింటికీ అగ్రిమెంట్లు అయ్యాయి.


- సిద్ధారెడ్డి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎస్ఈ.

నరకయాతన పడాల్సి వస్తోంది

మా గ్రామానికి అత్యవసర వాహనాలు రావడానికి కూడా ఇబ్బందిగా ఉంది. ఊరి నుండి మండల కేంద్రానికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు నరకయాతన పడాల్సి వస్తోంది. అలాగే కల్వర్టు బ్రిడ్జి పడిపోయి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్న పట్టించుకునే నాధుడే లేడు. మా ఊరికి రోడ్డు వేసి కల్వర్టు బ్రిడ్జి కట్టించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను

- ధనుంజయ్, మాచనూరు సిపిఎం నాయకులు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నా ఆటోలో డేగులపాడు చెందిన గర్భిణీని ఆటోలో ఎక్కించుకొని ఆస్పత్రికి బయలుదేరాను. ఏరూరు గ్రామం దాటాక ఆ కంకర తేలిన గుంతలలో ఆటో వెళుతున్నప్పుడు అక్కడ ఇక్కడ ఊగడంతో మధ్యలోనే గర్భిణీ ప్రసవించింది. అదృష్టం బాగుండి కాన్పు బాగా అయింది. ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. రహదారికి మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను, ఆర్ అండ్ బి ఉన్నతాధికారులను కోరుతున్నాము.

- ఆంజనేయులు, ఆటో డ్రైవర్, డేగలపాడు, చిప్పగిరి మండలం.

ప్రమాదాలు ఎక్కువయ్యాయి



నందవరం నుండి నాగలాదీన్నే వెళ్లె రహదారి మూడు రాష్ట్రాలను కలుపుతూ విస్తరించి ఉంది. వంతెన నిర్మించిన తర్వాత ఈ రహదారిపైన భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఈ వాహనాల రాకపోకలకు రహదారి అనుకూలంగా లేదు. చాలా చిన్నగా ఉండటం వల్ల ప్రమాదాలు ఎక్కువయ్యాయి. ప్రభుత్వాల స్పందించి ఈ రహదారిని హైవేగా నిర్మిస్తే రవాణ పెరిగి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు జరుగుతున్న ప్రమాదాలను కూడా నివారించవచ్చు.

- పివి రాజేష్, నాగలదిన్నె, నందవరం మండలం.

ముస్లిములకు, దళితులకు రక్షణ కరువు

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్
- వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని ఆదోనిలో ముస్లిముల ప్రదర్శన
- మద్దతుగా పాల్గొన్న సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ముస్లింలకు, దళితులకు రక్షణ కరువైందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. వక్ఫ్ చట్ట సవరణను తక్షణమే రద్దు చేయాలని ముస్లిములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ గురువారం ఆదోని పట్టణంలో ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక తిక్కస్వామి దర్గా నుండి పోలీస్ కంట్రోల్ రూమ్ మీదుగా ముస్లిములు జాతీయ జెండాలు, నల్ల జెండాలతో పిఎం మోడీ, సిఎం చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ భీమాస్ కూడలికి చేరుకోవడంతో జనసంద్రంగా మారింది. అక్కడి నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకొని నిరసన చేపట్టారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు అందజేశారు. ఈ నిరసనకు సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ బిజెపి చేస్తున్న అరాచకాలను సిపిఎం ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ, ఎండగడుతూ, బిజెపి ఆలోచన విధానాలను ప్రజలకు వివరిస్తూ ఉందన్నారు. సమస్యల సాధన కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లింల హక్కుల సాధనకై భవిష్యత్తులో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు.

ముస్లిం మత పెద్దలు ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ అల్లాబకష్, షేక్ జిక్రియా, ధూల్ షా పహల్వాన్ మసీదు ముతవల్లి మాట్లాడారు. ముస్లింల ఆర్థిక అభివృద్ధికి గుదిబండగా మారిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ముస్లిములనే టార్గెట్ చేసి కేంద్ర ప్రభుత్వం అణగదొక్కే ప్రయత్నం చేయడం మాను కోవాలన్నారు. మోడీ చేసిన బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతు ప్రకటించడం దురదృష్టకర మన్నారు. బిల్లును ఎత్తివేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సాయి : ర్యాలీకి వైసిపి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ర్యాలీ ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పాల్గొనిసంఘీభావం తెలిపారు. ముస్లింలకు అండగా ఉంటామని తెలిపారు.

అలాగే సిపిఐ రాష్ట్ర నాయకుడు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్‌లు మద్దతు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశులు, సీనియర్ నాయకుడు రామాంజనేయులు, హాజీంఖాన్, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మణ్, లింగన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, అడ్వకేట్ మన్సూర్ అహ్మద్, ఎస్‌డిపిఐ సద్దాం హుసేన్, అబ్దుల్ రవుఫ్, షాహి జామియా మసీదు ముతవలి, అడ్వకేట్ నాసిర్, షఫీ అహ్మద్, ఎంఐఎం జునైద్, కౌన్సిలర్ ఫయాజ్, మునీర్, ఇక్బాల్, రహమాన్, పరిగల నారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనకు భారీ బందోబస్తు : ముస్లిములు చేపట్టిన ప్రదర్శనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డిఎస్‌పి హేమలత ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సిఐలు రాజశేఖర్ రెడ్డి, శ్రీరామ్, రామలింగయ్య ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘ ఉంచారు. సీసీ కెమెరా, డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించారు. ముందు జాగ్రత్త చర్యగా వజ్ర వాహనాన్ని తెప్పించి ప్రత్యేక పోలీసులను రప్పించారు.



ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మత పెద్దలు, మద్దతు తెలియజేస్తున్న వైసిపి, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు

ఉత్తమ ర్యాంకులు శ్రీగాయత్రికే సొంతం : ప్రిన్సిపల్ వాసు బాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



పది, ఇంటర్‌లో ఉత్తమ ర్యాలంకులు సాధించడం శ్రీ గాయత్రికే సొంతమని ప్రిన్సిపల్ పి.వాసుబాబు పేర్కొన్నారు. నగరంలోని దేవనగర్‌లో మౌర్య హాస్పిటల్ ఎదురుగా ఉన్న శ్రీగాయత్రి బాలికల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.వాసుబాబు గురువారం మాట్లాడారు. ఇటీవలే వారి విద్యార్థులు ఇంటర్‌లో మంచి ఫలితాలను తెచ్చినం దుకు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ గాయత్రిలో ఇంటర్‌తో పాటు టాప్ ర్యాంకులను సాధింపజేస్తున్న శ్రీగాయత్రి స్పెషల్ ప్రోగ్రామ్స్ గురించి వివరించారు. కాలేజీ రోజులు జీవితాంతం మరుపురాని గుర్తులని, అటువంటి కాలేజీ రోజులు ఎంతో ఆనందంగా గడపగలిగే, తమ లక్ష్యసాధనకు అనువుగా ఉండేలా ప్రతి విద్యార్థి కోరుకుంటారని తెలిపారు. అలా వారి కోసం సిఐటి క్లౌడ్ ఇంట్రాక్టివ్ టీచింగ్ సిస్టంతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఆధునిక శిక్ష, ఆడియో విజువల్స్ ద్వారా ఎక్స్‌పోర్ట్ ఫ్యాకల్టీచే బోధన ఉంటుందన్నా రు. ఆధునిక సౌకర్యాలు గల క్లాస్ రూమ్స్ పరిమిత సంఖ్యలో విద్యార్థులు, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పూర్తిస్థాయి సైన్స్ ల్యాబరేటరీలు, ఆన్‌లైన్ పోటీ పరీక్షలకు ప్రాక్టీస్ కోసం కంప్యూటర్ ల్యాబ్స్ సమగ్ర స్టడీ మెటీరియల్, సాధారణ విద్యార్థులు సైతం సక్సెస్ సాధించేలా ప్రోగ్రామ్స్, ఎస్‌జిఎల్ ప్రోగ్రామ్స్, ఐఐటి లక్ష్యసాధన కోసం ఎస్‌జిఎల్ స్పార్క్ బ్యాచ్ అండ్ ఎన్ఐటి లక్ష సాధన కోసం ఎస్‌జిఎల్ టెక్నో బ్యాచ్, నీట్ లక్ష సాధకుల కోసం ఎస్‌జిఎల్ మెడికో బ్యాచ్, ఇంజనీరింగ్, మెడికల్ ఐసి ప్రోగ్రామ్స్, ఇంజనీరింగ్ ఐఐటిఐసి అండ్ ఎన్ఐటిఐసి, మెడికల్ నీట్ ఐసి సమాచారం కోసం ఫోన్ నెం. 7207108627 9581991093లను సంప్రదించాలని సూచించారు.

'పది'లో కస్తూరి స్కూల్ విజయ భేరీ

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్



కర్నూలు నగరం వన్ టౌన్ తెలుగు వీధిలోని కస్తూరి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో పి.వివేక్ 583, జి.పూజిత 582, కె.శ్రీనివాసులు 579, దివ్య తులసి 570 మార్కులు సాధించారు. గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ మిన్నల్లా మాట్లాడుతూ... ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రాజకుమార్ పాల్గొన్నారు.

'పది'లో రామకృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్




నగరంలోని మద్దూరు నగర్‌లో ఉన్న రామకృష్ణ విద్యాలయం హై స్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ స్థానంలో మహేంద్ర 552, ఈశ్వరి 549, స్థితిశ్రీ 519 సాధించారని కరస్పాండెంట్ పి.సునీత, ప్రధానోపాధ్యాయులు జి.మనోహర్ గురువారం తెలిపారు.

'పది'లో జడ్‌పి హైస్కూల్ ప్రతిభ

- అభినందించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పదో తరగతి ఫలితాల్లో కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎస్.మదీహా 530, ఎస్.సాఫియా 508, వినీత్ 480 మార్కులు విద్యార్థులను సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప, ముజఫర్ నగర్ కార్యదర్శి ఎంసి.ఆనంద్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు టివిఎల్ పద్మావతి, ఎస్.మధుమతి అభినందించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప మాటాడుతూ... విద్యార్థులు సమాజం పట్ల అవగాహన, తల్లిదండ్రులు, గురువుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండడం లాంటి అనేక మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాబోయే కాలంలో వంద శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను, విద్యార్థులను కోరారు.



విద్యార్థిని అభినందిస్తున్న నాయకులు

'పది'లో విశ్వవాణి విజయభేరి

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని న్యూ విశ్వ వాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారు. 581 మార్కులతో కణిజ్ ఫాతిమా స్కూల్ టాపర్‌గా నిలిచారు. 564 మార్కులతో షేక్ ఆర్బిన్, 541 మార్కులతో కార్తికేయ, 504 మార్కులతో మానస, 500 మార్కులతో యశశ్రీలు సత్తా చాటారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఖలీల్, గిడ్డయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ... మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. స్కూల్ టాపర్‌గా నిలిచిన ఫాతిమాను అభినందించారు. హిందీలో వంద మార్కులను తీసుకొచ్చేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు నజ్రీన్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు రాబియా, కల్పన, భారతి పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించండి

- సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన, మృతులకు నివాళి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని యావత్ ప్రపంచమంతా ఖండించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండి ఆనంద్ బాబు మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో 28 మంది మరణించడం బాధాకరమన్నారు. ఈ ఘటన జరుగుతుందని నెలరోజుల ముందే ఇంటెలిజెన్సీ నిఘా వర్గాలు గుర్తించినట్లు తెలిసిందన్నారు. లస్కరే తోయబా అనుబంధంగా ఉండే ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం ఉందని తెలియజేసినప్పటికీ భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆర్టికల్ 371 35ఏ రద్దు చేస్తే ఉగ్రవాద ఘటనలన్నీ జరగకుండా ఆగి పోతాయని ప్రజలందరిని నమ్మించి జమ్మూ కాశ్మీర్లో కార్పొరేట్లకు భూములన్నింటిని కట్టబెట్టడానికి ప్రధాని మోడీ కుట్ర చేశారని ఈ ఘటనతో బహిర్గతమైందని తెలిపారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఓదార్చాల్సింది పోయి ఈ ఘటనని కూడా ఒక మతానికి టార్గెట్ చేస్తూ ఉద్దేశపూర్వకంగా రాబోయే బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బిజెపి దేశవ్యాప్తంగా కుట్రలు చేస్తోందన్నారు. వేసవిలో ఆహ్లాదకరమైన పహల్గాంలో పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని తెలిసినప్పటికీ వారికి భద్రత కల్పించడంలో కేంద్రం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ ఉగ్రదాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమీషా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు అక్కడ చూసిన ఉగ్రదాడిలో గాయపడిన వారిని రక్షించిన గుర్రాల నిర్వాహకుడు ముస్లిం అని, ఆ దాడి హిందువా కాదా అని అడిగి మరీ చంపారని దేశవ్యాప్తంగా ప్రచారం చేయడం తప్పు అన్నారు. ప్రత్యక్షంగా ఆ దాడిలో భర్తను కోల్పోయిన మహిళ చెబుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా హిందూ సెంటిమెంటును రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి చూస్తుందన్నారు. ఈ కుట్రను ప్రజలందరూ అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజల పాణాలు రక్షించడానికి, దేశ భద్రతను పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న ఉగ్రవాదులందరి పైన కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్, నరసింహ, నగేష్, గురు శేఖర్, మహిళ నాయకులు సావిత్రి, విద్యార్థి సంఘం నాయకులు రంగప్ప, అబ్దుల్లా, సాయి ఉదయ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయి బాబా, సుధాకరప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య జంక్షన్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

ఉత్తమ ఫలితాలు సాధించిన సిరాక్ విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ఓల్డ్ సిటీ సిరాక్ స్కూల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించారు. ఫాతిమా 594 మార్కుల, సాత్విక్ గౌడ్ 591, మహమ్మద్ ఫహద్ 587, అలియా జైమా 585 నస్రీన్ 585 మార్కులు సాధించి వరుస విజేతలుగా నిలిచారు. 590కి పైగా ఇద్దరు, 585 పైన ముగ్గురు, 550కి పైగా 19 మంది, 500కు పైగా 36 మంది విద్యార్థులు మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. మిఠాయిలు తినిపించి హర్షం వ్యక్తం చేశారు. స్కూల్ కరస్పాండెంట్ జిఎండి ఇబ్రహీం ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుపెప్పుడు లేని విధంగా పది ఫలితాల్లో మా విద్యార్థులు విజయభేరీ మోగించారని హర్షం వ్యక్తం చేశారు. ఒక ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేసినటువంటి ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు వజిరా ఖాతున్, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మేరీ స్వప్న, సంగీత మాస్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రియాజ్, నవీన్, ఉమామహేశ్వరీ, ఇమ్రాన బేగం, నజిమా, సరితా రమాదేవి, యాస్మిన్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

'పది'లో సాయుధ పోలీసు విద్యానికేతన్ ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



పదో తరగతి ఫలితాల్లో సాయుధ పోలీసు విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపల్ నగేష్ తెలిపారు. పి.ముకుందశ్రీ 583 మార్కులు, ఆర్.నిహారిక 575, ఎస్.రిషిత 565, డి.ధీరజ్ 511, జి.గంగాధర్ 509, బి.హరిణి 504, పి.హారిక 494, డి.హరిణి 492, డి.మహేష్ బాబు 489, కె.సాయి భార్గవి 483, జి.వీరభద్ర 479, జె.ప్రవల్లిక 478 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ శ్రేణిలో 36 మంది, ద్వితీయ శ్రేణిలో 5గురు, గృతీయ శ్రేణిలో ఇద్దరు ఉత్తీర్ణత సాధించారన్నారు. తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి, గురువుల మార్గనిర్దేశనం ఈ విజయంలో ముఖ్య పాత్ర పోషించాయని తెలిపారు.

ఉగ్రవాదాన్ని నశింపజేయాలి

- ఎస్ఎఫ్ఐ క్యాండిల్స్ ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉగ్రవాదాన్ని నశింపజేయాలని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు కోరారు. గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీని పరిపాలన భవనం నుంచి ప్రధాన ద్వారం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వ కలిగి ఉందని, అటువంటి దేశంలో ఉగ్రవాదం అనే దాన్ని సహించేదిలేదని అన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని నశింపజేయాలని, ప్రపంచ దేశాలు ఏకమవ్వాలని కోరారు. ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదుల దుశ్చర్యను ముక్త ఖంఠంతో వ్యతిరేకించాలని తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, రాజు, సాగర్, అమర్, కృపాకర్, గణేష్, రతీశ్, పవన్, అభిషేక్, ఓబులేసు, తిరుమల, దివాకర్, నరేష్, బాలాజీ నాయక్, రాజేంద్ర నాయక్, సాయి, శివ, జోష్ కుమార్, అవినాష్, సందీప్, మహ్మద్, ప్రవీణ్, ప్రకాష్, రాజు, మనోహర్, నవీన్, శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

ఉగ్ర దాడి హేయమైన చర్య: పెహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య అని జిల్లా మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న ఉగ్రవాదుల దాడులపై బిజెపి ప్రభుత్వం సరైన నిర్ణయంతో కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కులమతాలను దూరం చేసి పెను మార్పులను చేర్చి ఉగ్రవాదుల దాడులకు 30 మంది మృతి చెందారన్నారు. చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మే 20న దేశవ్యాప్త సమ్మె - సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మిక హక్కులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. మే 20న కార్మిక హక్కుల పరిరక్షణకు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. గురువారం సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి సన్నద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఏప్రిల్ నుంచి అమలు చేయాలని సూచనలు చేస్తోందని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు గ్రాట్యుటీ, పింఛను, వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని సిఐటియు పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.ఇస్మాయిల్, బి.కేశన్న, కె.గోరు బాష, బి.సల్మాన్, కె.ఖాజా, బి.రంగస్వామి, సిఐటియు నాయకులు పి.రాజు, తిమ్మప్ప పాల్గొన్నారు.

దాడులు, దౌర్జన్యాలపై పోరాటం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న - కెవిపిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పెద్దకడబూరు



కుల దురహంకార దాడులకు, దౌర్జన్యలకు వ్యతిరేకంగా కెవిపిఎస్ పోరాడుతోందని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తెలిపారు. గురువారం పెద్దకడబూరులో కెవిపిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మంచోది రామన్న, నూతన అధ్యక్షులుగా బొగ్గుల అనిల్, కార్యదర్శిగా తలారి రాజు, కోశాధికారిగా కెబి.ఏసురాజు, ఉపాధ్యక్షులుగా ఎం.ప్రభాకర్, మాల నరసింహులు, జి.ఆంథోని, బి.పరమానందం, జి.రవి, ఎంకె.సుధాకర్, సహాయ కార్యదర్శులుగా బి.బాబు, దినకర్, జి.సిమోను, జె.లాజర్, బెంజిమన్, ఆనందరాజుతో 30 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. రాబోయే రోజుల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. మండలంలోని అనేక గ్రామాల్లో దళితులకు శ్మశాన స్థలాలు, ఇళ్ల స్థలాల్లేవని, కనీసం తాగునీరు కూడా దొరకడం లేదని విమర్శించారు. సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

ఊపిరి ఉన్నంత వరకు బీవీ వెంటే

- టిడిపి 30వ వార్డు నాయకులు విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపిన విజయలక్ష్మి

ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సంక్షేమం కోరే ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి వెంటే ఉంటామని టిడిపి 30వ వార్డు నాయకులు విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం టిడిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలు, నిర్ణయాలు చంద్రశేఖర్ విజయలక్ష్మికి వివరించారు. వార్డు సమస్యలపై తక్షణమే స్పందించడం పట్ల విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటానని, ఏ సమస్యలున్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇకపై ఉదయం, సాయంత్రం వార్డులో పర్యటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల గురించి వివరిస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు.

భార్య కోసం చస్తానని.. సెల్ టవర్ ఎక్కి యువకుని హల్ చల్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య స్వాతి తనతో సెల్ ఫోన్‌లో మాట్లాడడం లేదని తనను పట్టించుకోవడం లేదని భర్త మోహన్ సెల్ టవర్ ఎక్కి చస్తానని హల్ చల్ చేశారు. గురువారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. అక్కడికి భారీగా గ్రామస్తులు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివాంజల్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కిందికి దిగాలని, సమస్యను పరిష్కారిస్తామని మైకుల ద్వారా హామీ ఇచ్చారు. కిందికి దిగిన మోహన్‌ను హెడ్ కానిస్టేబుల్ ఎంవి.రమణ, పోలీసులు పరమేష్ స్టేషన్‌కు తీసికెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

భారతదేశ దశా దిశ నిర్దేశకుడు అంబేద్కర్

- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన
- వేలాదిమంది హాజరు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భారతదేశ దశ దిశ నిర్దేశకుడు అంబేద్కర్ అని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. గురువారం రాత్రి కెవిపిఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరానికి చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రంగస్థల నటులతో పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ థియేటర్‌లో నాటిక ప్రదర్శన ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది మంది దళిత, బహుజనులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తరలివచ్చారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర కార్యదర్శి, టిడిపి నాయకులు డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, సిపిఎం నాయకులు రామాంజనేయులు, గోవిందు, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆనంద్ చైతన్య మాదిగ, బీసీ సంఘం నాయకులు డాక్టర్ గణేష్ హాజరై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడారు. రంగస్థలం నటులతో అంబేద్కర్ జీవిత చరిత్రను నాటక కళా రూపంలో ప్రదర్శించడం కృషికి అభినందనీయమని ప్రశంసలు కురిపించారు. ఈ నాటక ప్రదర్శనలో ఆయన పుట్టుక, పేదరికం, పాఠశాలలో అణిచివేత, ఉన్నత చదువులు, బాల్య వివాహం, అంశాలపై కళాకారులు ప్రదర్శించారు. ఈ నాటిక దాదాపు 2.30 గంటల పాటు కొనసాగింది. కెవిపిఎస్ జిల్లా నాయకులు కరుణాకర్, మండల నాయకులు తిమ్మన్న పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు


నాటక ప్రదర్శన చేపడుతున్న కళాకారులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం గ్రామస్తులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. గురువారం ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజానగర్ దగ్గర నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి కౌతాళంకు తాగునీరు సరఫరా చేస్తున్నారని, 30 ఏళ్ల క్రితం ఉన్న పైపులైను ద్వారా ఇప్పటివరకు తాగునీరు సరఫరా అవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జనాభా పెరిగిందని, కొత్త కొత్త కాలనీలు పెరగడం వల్ల ఒక ఓవర్ హెడ్ ట్యాంక్ నీళ్లు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి కౌతాళం, బాపురం, ఉరుకుంద, ఎరిగేరి గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. అన్ని గ్రామాలకూ ప్రత్యేకంగా పంపిణీ చేయడానికి మోటార్లు ఉన్నాయని, కౌతాళం, బాపురానికి కలిపి ఒకే మోటారు ఉందని చెప్పారు. విద్యుత్ సమస్య వల్ల మోటార్లు కాలిపోతే నీటి సమస్య ఏర్పడుతోందన్నారు. నాలుగు రోజుల క్రితం మోటార్ కాలిపోవడం వల్ల 15 రోజులైనా వార్డుల్లో నీళ్లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పథకానికి 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. రెండు రోజులకు ఒకసారి తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారు లు హామీ ఇచ్చారు. సర్పంచి పాల్ దినకరన్, సిపిఎం నాయకులు వలీ, గిరప్ప, జనసేన రామాంజనేయులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంపిడిఒకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - చిప్పగిరి

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాష చేతుల మీదుగా ఎంపిడిఒ అల్లా బకాష్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అల్లా బకాష్ మాట్లాడారు. మండలంలో అధికారులందరూ ప్రభుత్వం ఆదేశించిన విధులను ఎప్పటికప్పుడు నెరవేరుస్తున్నందుకే ఈ రోజున ఈ ఉత్తమ అవార్డు పొందామన్నారు. ఉత్తమ అవార్డుతో మరింత పట్టుదలతో పని చేస్తానని తెలిపారు. ఉత్తమ అవార్డు గ్రహీత అల్లా బకాష్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు. అలాగే పంచాయతీల అభివృద్ధికి మంచి ప్రతిభ కనబరిచిన పంచాయతీ కార్యదర్శి ప్రమీల కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం మండలానికి ఒక గుర్తింపు లభించిందని చెప్పారు. ప్రమీలకు ఇఒఆర్‌డి బాలన్న, పంచాయితీ కార్యదర్శులు, ఇతర అధికారులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎంపిడిఒ అల్లా బకాష్

గోనెగండ్ల పంచాయతీ కార్యదర్శికి ఉత్తమ సేవాపత్రం

గోనెగండ్ల : గోనెగండ్ల మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జీ కార్యదర్శిగా పని చేస్తున్న టి.సతీష్ ఉత్తమ సేవా పత్రం అందుకున్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా పరిషత్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాష చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న సతీష్ గత కొద్ది సంవత్సరాలుగా గోనెగండ్ల మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పంచాయతీలో సక్రమంగా అమలు చేసి ప్రజలందరికీ సేవలు అందిస్తూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన కృషికి గాను ఉత్తమ సేవా పత్రం లభించింది. ఉత్తమ అవార్డు అందుకున్నందుకు ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి అనంతశయన, కార్యాలయ ఎఒ బాబు భాస్కర్, గ్రామ సచివాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.



కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సతీష్

ఆటో డ్రైవర్ల బిడ్డలు.. చదువులో ఆణిముత్యాలు

- 'పది'లో అత్యధిక మార్కులు సాధించిన ఆటో డ్రైవర్ల కూతుర్లు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని కులుమాల గ్రామానికి చెందిన జె.ఆనంద్ కుమార్, ఎస్.మాబు బాష, చిన్నమరివీడు గ్రామానికి చెందిన ఎం.జయరాజులు సాధారణ ఆటో డ్రైవర్లు. రోజూ ఆటో నడుపుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారు. వారి బిడ్డలను మాత్రం ఉన్నంతలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి వరకు చదివించారు. ఆ బిడ్డలు కూడా తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదివారు. పదో తరగతి ఫలితాల్లో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించి మండలంలో టాపర్లుగా నిలిచారు. మండలంలోని చిన్నమరివిడు గ్రామానికి చెందిన ఎం.జయరాజు, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. జయరాజు రోజూ చిన్నమరివీడు నుంచి ఎమ్మిగనూరుకు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె ఎం.సౌమ్య వెల్దుర్తిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో 576 మార్కులు సాధించి ఆ పాఠశాల టాపర్‌గా నిలిచారు. కులుమాల గ్రామానికి చెందిన జొహరాపురం ఆనంద్ కుమార్, నరసమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆనంద్ కూడా టాటా ఏస్ ట్రాలీ ఆటో ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె జె.ప్రగతి కులుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ పదో తరగతి ఫలితాల్లో 573 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. కులుమాల గ్రామానికి చెందిన షేక్ మాబు బాష, ఫాతిమాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన రోజూ కులుమాల గ్రామం నుంచి గోనెగండ్ల గ్రామానికి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె షేక్ రిజ్వానా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ పదో తరగతి ఫలితాల్లో 548 మార్కులు సాధించారు. తమ నమ్మకాన్ని నిలబెట్టి తమ బిడ్డలు మంచి మార్కులు సాధించినందుకు సంతోషంతో పాటు గర్వంగా ఉందని ఆ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులను గ్రామస్తులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.



సారా నిర్మూలనకు సహకరించాలి

- సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని



నాటుసారాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ కోరారు. గురువారం నాటు సారా స్థావరాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాటుసారా స్థావరాలను ఎప్పటికప్పుడు ధ్వంసం చేస్తూనే ఉన్నామన్నారు. శివారులోని గువ్వమ్మ సందు కొండల్లో 170 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 7 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ ప్రతాప్‌పై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ప్రజాశక్తి -ఆలూరు

ఆలూరులో విద్యుదాఘాతంతో గురువారం ఆవు మృతి చెందింది. చిన్నపాటి గాలివానకు డివైడర్ సెంటర్ విద్యుత్ స్తంభాలు విద్యుత్ తీగలపైకి ఒరిగింది. ఆవు రోడ్డు డివైడర్‌ను దాటుతూ స్తంభానికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు అప్రమత్తమై విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీపరిమళలో గుబాళించిన విద్యార్థి కుసుమాలు



ప్రజాశక్తి - మంత్రాలయం

పదో తరగతి ఫలితాల్లో స్థానిక శ్రీపరిమళ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రశంసలు అందుకున్నారు. శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీపరిమళ విద్యానికేతన్ పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 27 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ఎఒ, రిటైర్డ్ ఎంఇఒ కె.ఈరన్న గురువారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి మూడో స్థానంలో 563 మార్కులతో గొల్ల అంజలి నిలిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చినట్లు పేర్కొన్నారు. ఫస్ట్ క్లాస్‌లో 21 మంది, సెకండ్ క్లాస్‌లో ఐదుగురు, థర్డ్ క్లాస్‌లో ఒకరు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, కరస్పాండెంట్ సురేష్ కోనాపూర్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రావు, వనశ్రీ, ఉపాధ్యాయులు అభినందించినట్లు చెప్పారు.

'పది'లో మెరిసిన పల్లె ఆణిముత్యాలు

ప్రజాశక్తి - హొళగుంద

పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఇంగలదహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మెరిశారు. పదో తరగతి పరీక్షలను 75 మంది విద్యార్థులు రాయగా 52 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 70 శాతం ఉత్తీర్ణతను ఇంగలదహల్ పాఠశాల సాధించింది. బి.అశోక్ 546 మార్కులతో మొదటి స్థానం, వి.బాలాజీ 535 మార్కులతో రెండో స్థానం, అలాగే 526 మార్కులతో మూడో స్థానంలో ఉన్నారు. 500 మార్కులకు పైగా ఏడుగురు విద్యార్థులు సాధించారు. అందరూ గ్రామీణ రైతు బిడ్డలే. గణితంలో 100కు 100 మార్కులు దాదాపు నలుగురు విద్యార్థులు సాధించారు. 546 మార్కులు మొదటి స్థానం విద్యార్థి, 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థుల్లో అందరూ బాలుర హాస్టల్లో చదివే విద్యార్థులే. ఆ గ్రామానికి, పాఠశాలకు, వసతి గృహానికి మంచి పేరు తీసుకొస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధనయ్య గురువారం విద్యార్థులను అభినందించారు. అలాగే కెసి.తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, చంద్రశేఖర్, యూత్ సభ్యులు రాజు, రఫీ, మహానంది, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

మే 4న పంచమ భండార మహోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మే 3, 4న శ్రీగర్జి లింగేశ్వరస్వామి, పంచమ భండార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం పెద్దహరివాణం గ్రామస్తులు మాట్లాడారు. శ్రీగర్జి లింగేశ్వరస్వామి, శ్రీఅయ్యమ్మ అవ్వ దేవితో కలిసి మొత్తం 11 దేవతల ఉత్సవ విగ్రహాలను భక్తులు పెద్దహరివాణం గ్రామానికి తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఊరేగిస్తున్నట్లు తెలిపారు. పట్టా దేవర (పట్టాభిషేక) ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. గ్రామం నుంచి శ్రీగర్జి లింగేశ్వర స్వామి, శ్రీఅయ్యమ్మ అవ్వ, ముద్దటమాగి గ్రామం నుంచి నెరణికి లింగేశ్వరస్వామి, నెరణికి గ్రామం నుంచి నెరణికి లింగేశ్వర స్వామి, ఇరేహుల్తి గ్రామం నుంచి హుల్తీ కారుమంచప్ప స్వామి, బల్లూరు గ్రామం నుంచి బల్లురేశ్వర స్వామి, ఆగులూరి గ్రామం నుంచి సిద్ధలింగేశ్వర స్వామి, బదినేహాల్ గ్రామం నుంచి బీరలింగేశ్వర స్వామి, ఉప్పల గ్రామం నుంచి కరిలింగేశ్వర స్వామి, కైరుప్పల గ్రామం నుంచి హుల్తీ కారుమంచప్ప స్వామి, నాగలాపురం గ్రామం నుంచి నాగలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామాలకు తీసుకొచ్చి ఆలయంలో అభిషేకాలు, మంగళ హారతులు, కుంభోత్సవాలు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున సామూహిక వివాహాలు జరిపిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో వివిధ గ్రామాల నుంచి పట్టణ, గ్రామీణ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొంటారని తెలిపారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.



'సునీత'పై చర్యలు తీసుకోండి

- డిప్యూటీ డిఎంహెచ్ఒకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిర్లక్ష్యం తో తమ బిడ్డ ప్రాణాలు పోవడానికి కారణమైన డాక్టర్ సునీత, సునీత నర్సింగ్ హోంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త బి.ప్రకాశం కోరారు. గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణీ అయిన తన భార్య ఎంఎన్.ప్రియాంక గత తొమ్మిది నెలలుగా సునీత నర్సింగ్ హోం డాక్టర్ సునీత దగ్గర వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. గత నెల 29న ప్రియాంక ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉండడంతో ఈ విషయంలో డాక్టర్‌ను కలవాలని సిబ్బందిని సంప్రదించినట్లు చెప్పారు. సిబ్బంది డాక్టర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా 'డాక్టర్ రారు. రేపు ఉదయం రావాల'ని చెప్పడంతో తిరిగి 20న ఉదయం నర్సింగ్ హోంకు వెళ్లినట్లు తెలిపారు. డాక్టర్ మధ్యాహ్నం వచ్చి అన్ని పరీక్షలూ చేసి బేబీ గర్భంలోనే చనిపోయిందని చెప్పారని అన్నారు. తర్వాత డాక్టర్ సునీత సిఫారుసుతోనే కర్నూలు అశ్వినీ హాస్పిటల్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సిజేరియన్ ఆపరేషన్ చేసి చనిపోయిన బిడ్డను బయటకు తీశారన్నారు. కేవలం డాక్టర్ సునీత నిర్లక్ష్యం కారణంగానే బేబీ చనిపోయిందని, డాక్టర్ సునీతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త ప్రకాశం, ఎంఆర్‌పిఎస్ నాయకులు కడిమెట్ల గిడ్డయ్య, ముగతి ప్రతాప్ కుమార్, పూలచింత పెద్దయ్య కోరారు. వైద్యురాలుగా ఉంటూ రోగులు, గర్భిణుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్ సునీత, నర్సింగ్ హోంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


డిప్యూటీ డిఎంహెచ్ఒకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

'పది'లో ఎఫ్ఆర్ పాఠశాల ప్రభంజనం


- కరస్పాండెంట్ రఘునాథ్

ప్రజాశక్తి- దేవనకొండ

పదో తరగతి ఫలితాల్లో ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ రఘునాథ్, ప్రధానోపాధ్యాయులు ఉచ్చీరప్ప తెలిపారు. గురువారం ఎఫ్ఆర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బండారి అఖిల 556 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే విజయ్ కుమార్ 516, నిజాముద్దీన్ 513, తరుణ్ 506, చరణ్ 501 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థుల మంచి భవిష్యత్తుకు పదో తరగతి పునాది వంటిదని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రావణి, లక్ష్మీదేవి, స్రవంతి, షబానా, రంగస్వామి, ఎస్ఎమ్‌డి.బాష, గోపాల్, రవికుమార్ పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్ ప్రతిభ


ప్రజాశక్తి - హొళగుంద



పదో తరగతి ఫలితాల్లో హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 280 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 147 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో అత్యధికంగా మొదటి ముగ్గురు విద్యార్థులు ఎన్ఎస్.సందేశ 584 మార్కులు, ఎస్.ప్రవల్లిక 578, రంజిత్ 568 మార్కులు సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

'పది'లో కిడ్డీస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని



మెరుగైన విద్యకు మారు పేరుగా కిడ్డీస్ విద్యాసంస్థలు ఉన్నాయని కరస్పాండెంట్లు కేశవ నారాయణరెడ్డి, చిన్నపరెడ్డి పేర్కొన్నారు. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో టౌన్ టాపర్‌గా నిలిచిన సలీమాను అభినందించారు. గురువారం వారు మాట్లాడారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతేడాది కిడ్డీస్ విద్యార్థులు సత్తా చాటుతూనే ఉన్నారన్నారు. అత్యుత్తమ ఫలితాలు రావడంతో విద్యాసంస్థల ముందు సంబరాలు చేసుకున్నారు. 597 మార్కులు సాధించిన తమ విద్యార్థిని సలీమా ఆదోని టాపర్‌గా నిలిచారని తెలిపారు. సలీమా 597, కమ్మ హర్షిత 596, జయకిరణ్ 596, హుమర అష్రాఫ్ బేగ్ 596 మార్కులు సాధించి విజయ దుందభి మోగించారన్నారు. 548 సగటు మార్కులు సాధించి మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

సీఏ చేయాలన్నదే లక్ష్యం

- విద్యార్థిని కంసాలి కార్తీక

ప్రజాశక్తి - ఆదోని

సీఏ చేయాలన్నదే లక్ష్యమని విద్యార్థిని కంసాలి కార్తీక తెలిపారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థిని కార్తీక 594 మార్కులతో ప్రతిభ చాటారు. కార్తీక పట్టణంలోని రూట్స్ గ్లోబల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. తండ్రి మురళీకృష్ణ ఆచారి పట్టణంలో విలేకరిగా పని చేస్తున్నారు. తల్లి శశికళ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. కార్తీక మాట్లాడుతూ... ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల గైడెన్స్‌తో ఈ మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్‌లో ఎంఇసి గ్రూపుతో పాటు సీఏ కోచింగ్ తీసుకొని చార్టెడ్ అకౌంటెంట్‌గా స్థిరపడాలన్నదే తన ధ్యేయమని చెప్పారు.


సంబరాలు చేసుకుంటున్న విద్యార్థిని కార్తీక

శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో సీతారామిరెడ్డి


మహోత్సవంలో పాల్గొన్న సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాజీ ఎంపిపి రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురువారం మండలంలోని 52 బసాపురం గ్రామంలో వారి స్వగృహంలో పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీనివాస కల్యాణం కనులవిందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు గుర్రెడ్డి బ్రదర్స్ వారి నేతృత్వంలో ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూల మాల వేసి సన్మానించారు. రిటైర్డ్ తహశీల్దార్ వర్మ, వ్యక్తిగత కార్యదర్శి గురురాజ ఉన్నారు.

జాతీయత పార్కు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తాం

- సర్పంచి దాసరి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సలహా మేరకు చిప్పగిరిలో జాతీయత పార్కు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. గురువారం అమరావతిలో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి 10 మంది సర్పంచుల్లో చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన అనేక సలహాలు ఆకట్టుకున్నాయని సర్పంచి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ జాతీయత భావం పెంపొందించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సలహా ఇచ్చారన్నారు. సర్పంచులు గ్రామాలకు అంకితభావంతో పని చేస్తే గ్రామాలు కూడా సస్యశ్యామలం అవుతాయన్నారు. గ్రామాలకు ఆయువు పట్టు పంచాయతీలని, ప్రతి సర్పంచీ మంచి విజ్ఞతతో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, అప్పుడే ఆ గ్రామం అభివృద్ధి దశలో పయనిస్తుందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలవడం తమ అదృష్టమని అన్నారు.



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న సర్పంచి

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL CIVIL JUDGE AND JMFC AT BALLARI
O.S. No. 611/2024

Between:
Thimmappa and others. ...Plaintiffs
And
Smt.Ambamma and others. ...Defendants
To.
Defendant No.2
Smt. Sarojamma W/o. Dubba Eranna, aged about 47 years, R/o. Masanur village, Halaharvi Mandalam, Alur Taluk Kurool District.

SUMMONS

WHEREAS, the above named plaintiffs have filed the above suit against you seeking partition and separate possession.

You are hereby summoned to appear before this Hon'ble court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be instructed and able to answer all such question on the day of 07/07/2025 at about 11:00 "O" clock in the forenoon to answer the claim and further you are hereby directed to file on that day your objections and to produce on the said day all documents in your possession or power upon which, you base your defence or claim for set off or counter claim in support of your defence.

Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

Given under my hand and seal of the Court on this 23rd day of April 2025.

By order of the Court
Shirasthedar
II Addl Civil Judge and JMFC
At Ballari

M.Veerendra
Advocate for the Plaintiff